


న్యూస్ బాక్స్

బీఈడీ సెమిస్టర్ పరీక్షకు నోటిఫికేషన్

కర్నూలు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బీఈడీ 2015 నుంచి 2019 మధ్య పూర్తి చేసుకోలేని వారికి సెమిస్టర్ పరీక్షలకు అవకాశాన్ని కల్పిస్తున్నామని రాయలసీమ యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ వేంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 11 లోపు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ వద్ద తగిన రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్ సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఏఎస్ఐలకు పదోన్నతి

కర్నూలు క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ రేంజ్ పరిధిలో 11 మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లాకు చెందిన నలుగురు, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఏడుగురికి పదోన్నతులు కల్పించారు. పదోన్నతులు పొందిన వారు మంగళవారం డీఐజీ కార్యాలయంలో డీఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు. వీరంతా 1990 బ్యాచ్‌కు చెందిన వారు. పదోన్నతులు రావడం అభినందనీయమని, విధుల్లో మంచి ప్రతిభ కనబరచాలని డీఐజీ ఆకాంక్షించారు.

నవంబరు 1న రాష్ట్ర లోకాయుక్తకు సెలవు

కర్నూలు లీగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1వ తేదీన రాష్ట్ర లోకాయుక్తకు సెలవు దినంగా ప్రకటించినట్లు లోకాయుక్త రిజిస్ట్రార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు బదులుగా డిసెంబరు 21న పనిదినంగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ మార్పును ప్రజలు గమనించాలని ఆయన సూచించారు.

అవినీతి నిర్మూలనకు కృషి

విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి

కల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యుత్ శాఖ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ యం. ఉమాపతి పిలుపునిచ్చారు. మంగళవారం విద్యుత్‌భవన్‌లో విజిలెన్స్ అవేర్‌నెస్-2024లో భాగంగా ఉద్యోగులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఎస్ఈ యం.ఉమాపతి మాట్లాడుతూ విద్యుత్‌సంస్థ అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుని, నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ టెక్నికల్ ఓబులేసు, కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి. శేషాద్రి, ఏడీఈ విజయభాస్కర్ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జిల పాలన

- ప్రభుత్వ శాఖల్లో కీలక స్థానాలు ఖాళీ
- పెద్ద దిక్కులేక గాడి తప్పిన యంత్రాంగం
- జోడు పదవుల్లో తూతూ మంత్రంగా బాధ్యతలు
- ఇన్‌చార్జిలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, ఉద్యోగులు



జిల్లా పరిశ్రమల కేంద్రం



ఆటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ కార్యాలయం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో కీలక స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వాటిని తూతూ మంత్రంగా ఇన్‌చార్జిలతో నింపేశారు. ఫలితంగా పాలన గాడి తప్పి పౌరసేవలు, ప్రజాసంబంధాలు, కార్యాలయ కార్యకలాపాలు అటకెక్కాయి. ఏ పని ముందుకు సాగాలన్నా ఇన్‌చార్జి అనే కారణంతో వాటిని పట్టించుకోవడం లేదు. బాధ్యతలు చేపట్టిన అధికారులు అతిథి పాత్రలతో ద్విపాత్రాభినయం చేస్తుండటంతో శాఖల్లో పారదర్శక పాలన లోపించి, అటు ఉద్యోగులు, ఇటు కార్యాలయానికి పలు పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంతకాల నుంచి చిన్నపాటి అనుమతుల వరకు వేచి చూసే దోరణి ఉండటంతో చాలా పనుల్లో జాప్యం జరుగుతోంది.

● రాష్ట్ర ప్రభుత్వం అడవుల పెంపకం, వాటి సంరక్షణ, వన్యప్రాణుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో అత్యంత కీలకమైన కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు స్థానాన్ని ఇన్‌చార్జిలకు అప్పగించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఎఫ్ రామకృష్ణ సాధారణ బదిలీల్లో భాగంగా 20 రోజుల క్రితం బదిలీ కాగా, అనంతపురం సీఎఫ్‌గా నియమితులైన యశోదబాయికు కర్నూలు సీఎఫ్‌గా అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అసలే మూడు జిల్లాల పరిధిలో విధుల నిర్వర్తించాల్సిన ఆమెకు, కర్నూలు ఇన్‌చార్జి బాధ్యతలతో ఆరు జిల్లాల విధులు భారంగా మారాయి. దీనికి తోడు సీఎఫ్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే అధికారిక పర్యటన నిమిత్తం యశోదబాయి విదేశాలకు వెళ్లటంతో ఆ బాధ్యతలను జిల్లా అటవీ అధికారికి శ్యామలను ఇన్‌చార్జిగా నియమించారు. ఈమెకు సైతం ఈ బాధ్యతలు అదనపు భారంగానే మారాయి.

మిగతా 8లో..

హెచ్ఎన్ఎస్ఎస్‌కు రూ.2వేల కోట్లు కేటాయించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్



హంద్రీనీవా ప్రధాన కాలువను పరిశీలిస్తున్న సీపీఐ రాష్ట్ర బృందం

పత్తికొండ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయలసీమకు వరప్రసాదిని అయిన హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2వేల కోట్ల నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పత్తికొండ మండల పరిధిలోని పందికోన హంద్రీనీవా రిజర్వాయర్, హంద్రీ నీవా ప్రధాన కాలువను సీపీఐ రాష్ట్ర బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా హంద్రీనీవా ప్రాజెక్టు స్థితిగతులను పందికోన రిజర్వాయర్‌లో నిలిచిపోయిన పనులను సీపీఐ బృందం అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమలో హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు అందించే జలప్రదాయని అన్నారు. 1996లో చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసినప్పటికీ గత 30 ఏళ్లుగా అనేక ప్రభుత్వాలు మారినా హంద్రీనీవా ప్రాజెక్టుకు మాత్రం పూర్తి కాలేదు. ఈ ప్రాంతంలో నిత్యం కరువు కాటకాలకు నిలయంగా మారిందని, ఇలాంటి హంద్రీ నీవా ప్రాజెక్టును పూర్తి చేసి పంట పొలాలకు, ఇటు గ్రామాలకు సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. కర్నూలు జిల్లాలో ప్రారంభమవుతున్న లిఫ్టు ఇరిగేషన్ ద్వారా హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు జిల్లాను దాటుకుని అనంతపురంతో పాటు చిత్తూరు ఉమ్మడి జిల్లాలకు సాగు, తాగు నీరు అందిస్తున్న ప్రాజెక్టు అని వివరించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా అయిన.. చిత్తూరు జిల్లాకు హంద్రీనీవా జలాలు వెళ్లాలంటే హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు నిర్మాణ పనులు పూర్తయితే తప్ప.. ఆ ప్రాంతానికి నీరు పారే పరిస్థితి లేదన్నారు. అలాగే పందికోన రిజర్వాయర నిర్మాణ పనులను పూర్తి చేసి కుడి, ఎడమ కాలువల ద్వారా కాలువను పూర్తి చేసి వేలాది ఎకరాల పంట పొలాలకు సాగునీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీనియర్ నాయకుడు సూర్యనారాయణ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాసాహేబ్, నబీరసూల్, గురుదాస్, కారన్న, తిమ్మయ్య, ఈరన్న, సుల్తాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నివారణే లక్ష్యం

జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్, ఎస్పీ 8

దివ్వెల సొబగులు దీపావళి వెలుగులు

జోరుగా మట్టి ప్రమిదల విక్రయాలు

టపాసులతో జాగ్రత్త 8



రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తాం

రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి



బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

డోన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం అమరావతిలో సీడ్స్ కార్పొరేషన్ కార్యాలయంలో మొదటిసారి బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా రైతులకు విత్తనాల కొరత రాకుండా కృషి చేస్తామన్నారు. తంగడెంచ విత్తనోత్పత్తి క్షేత్రంను అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రబీ సీజన్ విత్తనాల టెండర్లు, కంపెనీ షేర్లు, ఉద్యోగుల డీఏ రెండు విడతలు తదితర అంశాలపై బోర్డు మీటింగులో చర్చించినట్లు సుబ్బారెడ్డి తెలిపారు.

● **మంత్రి బీసీని కలిసిన టీడీపీ యువ నాయకులు :** రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని డోన్ నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి, భరత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బనగానపల్లెలోని మంత్రి స్వగృహంలో బీసీ జనార్దన్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

రోడ్డు కుదింపునకు ఆమోదం

- 60 రోడ్డు 30 అడుగులకు ఓకే
- పట్టణం పెరుగుతుంటే రోడ్లు తగ్గడంపై విస్మయం
- భారీగా డబ్బులు చేతులు మారాయన్న అనుమానాలు



లలితా నగర్‌లో రోడ్డును ఆక్రమించి కట్టిన ఇంటి పిల్లర్లను కూలగొట్టిన అధికారులు (ఫైల్)



నోటీసులు అంటించిన మున్సిపల్ అధికారులు (ఫైల్)

నంద్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణం రోజురోజుకూ పెరుగుతోంది. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని అనుకుంటున్న అధికారులు అంతర్గత రోడ్ల వెడల్పు గురించి పట్టించుకోవడం లేదు. గత టౌన్ ప్లానింగ్‌లో ఉన్న రోడ్డును కుదించేందుకు కౌన్సిల్‌లో ప్రతిపాదన ప్రవేశపెట్టారు. దీనికి కౌన్సిల్‌లోని మెజారిటీ సభ్యులు ఆమోద ముద్ర వేశారు. దీనివెనుక పెద్ద తతంగమే నడిచిందని, రోడ్డు కుదింపు ఆమోదముద్ర వేసేందుకు లక్షల రూపాయలు చేతులు మారాయన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. నంద్యాల పట్టణానికి 30 ఏళ్ల కిందే మాస్టర్ ప్లాన్‌ను తీసుకువచ్చారు. ఎన్జీఓస్ కాలనీ లలితా నగర్ రోడ్డు 80 అడుగులు ఉండేది. మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత పెరుగుతున్న పట్టణ అవసరాల దృష్ట్యా గత ప్రభుత్వం మరోమారు మాస్టర్ ప్లాన్‌ను తీసుకువచ్చింది. ఇందులో భాగంగా గతంలో 80 అడుగుల రోడ్డును 60 అడుగులకు కుదించింది. ప్రస్తుత పరిస్థితుల్లో రోడ్డు వెడల్పును ఇంతకంటే తగ్గిస్తే రోడ్డు వాహనదారులకు ఇబ్బంది కలుగుతుంది. గత ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్‌లో లలితా నగర్ రోడ్డు వెడల్పు 60 అడుగులుగా గత ప్రభుత్వం నిర్ణయించినపుడు మున్సిపాలిటీలోని మెజారిటీ సభ్యులు అభ్యంతరం పెట్టలేదు. అయితే హఠాత్తుగా మాస్టర్ ప్లాన్‌ను కాదని, 60 అడుగుల రోడ్డును 30 అడుగులకు కుదించటం వెనుకు ఎవరి హస్తం ఉంది? ఎందుకు ఇలా చేస్తున్నారు? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

మిగతా 8లో..

జోరుగా.. హుషారుగా..!

కేఎంసీలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కర్నూలు మెడికల్ కళాశాలలో ఉద్భవ-2024 పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. విద్యార్థుల ఆటపాటలతో కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డు అడిషనల్ డీఎంఈ డాక్టర్ వి.వెంకట రంగారెడ్డి హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. వైద్య విద్య ఎంతో ఉన్నతమైనదని, పేద రోగుల ఆరోగ్య ఇబ్బందులు, ప్రాణాలను కాపాడేది ప్రభుత్వ ఆసుపత్రులేనన్నారు. వైద్యవిద్యార్థులు అంకితభావంతో మెలగాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం కొత్త విద్యార్థుల చేత ప్రిన్సిపాల్ హిపోక్రేటిక్ ఓథ్ చేయించారు. విద్యార్థులకు కొత్త యూనిఫారాలను ప్రిన్సిపాల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్, సాయిసుధీర్, రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి









వైద్య విద్యార్థుల ప్రదర్శన

దివ్వెల సొబగులు.. దీపావళి వెలుగులు





- నగరంలో జోరుగా మట్టి ప్రమిదల విక్రయాలు
- విభిన్న రూపాల్లో వినూత్న డిజైన్లు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వస్తుందంటేనే ఇళ్లంతా దీప కాంతులతో నిండిపోతుంది. మహిళలు ఇంటి ముందు దీపాలు వరుస క్రమంలో వెలిగించి, దీపావళి లక్ష్మిని తమ ఇంటికి ఆహ్వానం పలుకుతారు. మూడు రోజులపాటూ నిర్వహించుకునే దీపావళి వేడుకలో ప్రధానంగా ఇళ్ల ముందు వెలిగించే మట్టి ప్రమిదలు ప్రత్యేకతను సంతరించుకుంటాయి. కొత్త మట్టి ప్రమిదలను తెచ్చుకొని, వాటిని బాగా కడిగి ఆరబెట్టి, అందులో ఒత్తులు, నూనె వేసి ఉదయం, సంధ్యా వేళల్లో వెలిగించడం తెలుగింటి సంప్రదాయం. మరో గురువారం దివ్వెల వేడుక దీపావళితో పాటు మరోవైపు నవంబరు 4 నుంచి కార్తీక మాసం ఆరంభం అవుతోంది. ఈ నేపథ్యంలో మట్టి ప్రమిదలకు ఆదరణ పెరిగింది. నగరంలో వారం రోజులుగా వివిధ ప్రాంతాల్లో వ్యాపారులు మట్టి ప్రమిదలు విక్రయాలు చేస్తుండగా, మహిళలు వీటి కొనుగోలుపై ఆసక్తి చూపిస్తున్నారు. నగరంలో సి.క్యాంపు, మద్దూర్‌నగర్, నంద్యాల చెక్‌పోస్టు, మెడికల్ కళాశాల రోడ్డు, పెద్దమార్కెట్, వెంకటరమణ కాలనీ, పంప్‌హౌస్ తదితర ప్రాంతాల్లో వ్యాపారులు వీటిని విక్రయిస్తున్నారు.

విభిన్న రూపాలు...వినూత్న డిజైన్లు

ఒకప్పుడు సాధారణ రూపంలోనే మట్టి ప్రమిదలు లభించేవి. నేడు మారుతున్న కాలానుగుణంగా విభిన్న రూపాలు, వినూత్న డిజైన్లలో ఇవి లభిస్తున్నాయి. గతంలో నల్ల మట్టితో తయారు చేసిన మట్టి ప్రమిదలే లభించేవి. కానీ నేడు ఎర్రటి టెర్రాకోట మట్టితో తయారు చేసిన ప్రమిదలను మహిళలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ టెర్రాకోట మట్టితో తయారైన ప్రమిదలను కళాకారులు విభిన్న కళాకృతులు ఒట్టిపడేలా రూపొందిస్తున్నారు. ఇవి సైజుల అనుసారంగా డజను రూ.30 నుంచీ 200 వరకు ధరలు పలుకుతున్నాయి. వీటిలో ఇంట్లో పూజ గదిలో వెలిగించేవీ, తులసి కోటల వద్ద, ఇంటి ప్రధాన ద్వారాల వద్ద, గోడలపై బారులుగా పెట్టే ప్రమిదలు అందుబాటులో లభిస్తున్నాయి. ఇక ఇళ్లకు ప్రత్యేక ఆకర్షణగా వేలాడే దీపాలు కూడా అమ్మకాలు చేస్తున్నారు.



కుమ్మరులకు ఆదరణ తగ్గింది



గతంలో కుమ్మరులు చేసే ప్రమిదలకు బాగా ఆదరణ ఉండేది. కానీ నేడు కుమ్మరుల స్థానంలో ఇతర కులాల వారు వచ్చి వీటిని అమ్మకాలు చేస్తున్నారు. దీంతో వృత్తిపరంగా జీవనోపాధిగా బతికే మాకు ఉపాధి కరువైంది. అటు వారికి పెద్దగా ఆదరణ లేదు. పైగా రోడ్లపై చాలామంది ఇవే అమ్మకాలు చేస్తుండటంతో కొనుగోలుదారులు బేరాలు ఆడి వెళ్లిపోతున్నారు. ఇతర వృత్తుల్లోకి వెళ్లలేక, మట్టినే నమ్ముకొని వ్యాపారం చేస్తున్నాం.

- కె.మధు, ప్రమిదల వ్యాపారి



నీటితో వెలిగే దీపాలు!



మార్కెట్‌లో నీటితో వెలిగే దీపాలు అందుబాటులోకి వచ్చేశాయి. నూనె అవసరం లేకుండా కేవలం నీరు పోయడం ద్వారానే ఇవి వెగులుతూ ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ప్లాస్టిక్ తో రూపొందించిన ఈ దీప ప్రమిదలు వాటి కింది భాగంలో చేతి గడియారాల్లో ఉపయోగించే చిన్న బ్యాటరీని అనుసంధానం చేశారు. ఈ బ్యారిటీకి పైన ఇచ్చిన రెండు సన్నటి తీగలకు నీళ్ల తగిలిన వెంటనే ఇవి వెలుగుతూ ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఇవి స్థానిక వ్యాపారులు ఒక్కో ప్రమిద రూ.40 చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. అమెజాన్, ఫ్లిఫ్‌కార్ట్ ఆన్‌లైన్ మార్కెటిం గ్‌లోనూ ఇవి అందుబాటులో ఉన్నాయి.

టపాసులతో జాగ్రత్త

ఆదోని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమవుతున్నారు. చిన్నాపెద్ద అంతా కలిసి బాణాసంచా కల్చుతూ ఆనందాన్ని పొందుతారు. ఇంతా సరదాగా జరుపుకునే పండుగలో ఏమాత్రం నిర్లక్ష్యం జరిగినా అది తీరని విషాదాన్ని నింపుతుంది. మరి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా దీపావళి ప్రశాంతంగా జరుపుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అగ్నిమాపక శాఖ అధికారులు, డాక్టరులు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. అవి ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

- ఆయిల్ క్యాన్లు, గ్యాస్ సిలిండర్లు తదితర మండే పదార్థాలకు దూరంగా పెట్టాలి.
- నైలాన్ దుస్తులు ధరించి బాణసంచా పేల్చవద్దు. ఈ వస్త్రాలకు మంటలు త్వరగా అంటుకునే స్వభావం ఉంటుంది. నూలు, ఖద్దరు బట్టలను మాత్రమే ధరించాలి.
- టపాసులు కాల్చటానికి పొడవాటి క్యాండిల్, అగర్‌బత్తి ఉపయోగించాలి. చేతిని పూర్తిగా చాపి టపాసులను ముట్టించాలి.
- గాలి వీస్తున్నప్పుడు రాకెట్లు, పైకి ఎగిరేవి కాల్చవద్దు.
- కాల్చిన బాణసంచాను నీరు నింపిన బకెట్‌లో వేయాలి.
- బకెట్ నిండా నీటిని, దుప్పట్లను సిద్ధంగా ఉంచుకోవాలి. ఫస్ట్ ఎయిడ్ కిట్ దగ్గర ఉంచుకోవాలి.
- వాహనాల వద్ద ఇళ్లలో టపాసులు కాల్చకూడదు.
- ప్రజలు భారీగా శబ్దం చేసే బాణసంచాను కాల్చకుండా.. పర్యావరణహిత టపాసులను మాత్రమే వినియోగించాలి.
- చిన్నారులు టపాసులు వేసేటప్పుడు వారిని ఒంటరిగా వదలకూడదు
- మరోవైపు టపాసులు కాల్చేటప్పుడు అజాగ్రత్తగా ఉండడం వల్ల కంటికి గాయాలతో ఏటా పదుల సంఖ్యలోనే ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులకు అత్యవసర చికిత్స కోసం వస్తుంటారు.
- ప్రమాదకరమైన బాణసంచా జోలికి వెళ్లకూడదు.
- బాణసంచాతో ప్రయోగాలు చేయకండి. పొగ ఎక్కువగా వచ్చే వాటిని వాడకండి.
- విద్యుత్ స్తంభాలు, కరెంట్ తీగల వద్ద టపాసులు పేల్చవద్దు.
- మందుగుండు కాల్చుతున్నప్పుడు ముఖం దగ్గరగా పెట్టకూడదు.
- బాణసంచా కాల్చే సమయంలో కళ్లకు అద్దాలు ధరించడం వల్ల రవ్వలు పడకుండా చూసుకోవచ్చు.
- ఎమర్జెన్సీ టోల్ ఫ్రీ నంబర్‌లను తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి. ఉదా: ఫైర్ ఇంజన్ 101, అంబులెన్స్ 108.

ఇన్‌చార్జిల పాలన

(7వ పేజీ తరువాయి)

ఇదే శాఖల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ డివిజనల్ ఫారెస్టు అధికారి స్థానం గత కొన్ని నెలలుగా ఇన్‌చార్జితోనే కొనసాగిస్తున్నారు. డోన్ సబ్ డివిజనల్ ఫారెస్టు అధికారిగా ఉన్న సూర్యచంద్రరాజుకు అదనంగా ఈ బాధ్యతలు ఇచ్చారు. ఫలితంగా తనిఖీలు నామమాత్రంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. అటవీ భూముల్లో ఇసుక తవ్వకాలు, తరలింపు, అటవీ ఉత్పత్తుల అక్రమ రవాణాలోను నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

- కర్నూలు జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ప్రాంగణంలోనే జోనల్ కార్యాలయం కొలువు తీరి ఉంది. ఇక్కడ మూడు జిల్లాకు సంబంధించి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు(జేసీఈఈ) ఉంటారు. నెల రోజుల క్రితం జేసీఈఈ ప్రసాద్ పదవి విరమణ పొందారు. ఈ నేపథ్యంలో విజయవాడ జేసీఈఈగా విధులు నిర్వర్తిస్తోన్న మునిస్వామి నాయుడుకు కర్నూలు జేసీఈఈగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఈయన వారం రోజులు విజయవాడ కేంద్రంగా, మరో వారం రోజుల పాటు కర్నూలు కేంద్రంగా పని చేస్తున్నారు. దీంతో పరిపాలనాపరమైన అంశాల్లో తీవ్ర ఆసౌకర్యం కలుగుతోంది. కింది స్థాయి అధికారుల మీద కూడా పర్యవేక్షణ కొరవడింది. జేసీఈఈ సైతం మొక్కుబడిగా వారం రోజులు ఇక్కడ హాజరవుతూ వారాంతంలో విజయవాడకు వెళ్లిపోతున్నారు. దీని వల్ల ఉద్యోగుల్లో బాధ్యతరాహిత్యం నెల కొంది. కింది స్థాయి అధికారులకు సరైన మార్గనిర్దేశం చేయ కపోవటంతో అసుపత్రుల్లో, నీరు, వాయువు పరీక్షలు, బయో వేస్టు మెడికల్ వ్యర్థాల పరిశీలన, సంబంధిత అసుపత్రుల తనిఖీ, అనుమతులపై పర్యవేక్షణ లేకుండా పోయింది.
- రాష్ట్ర ప్రభుత్వం గృహనిర్మాణ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది కానీ ఈ శాఖలో శాశ్వతంగా ఉన్నతాధికారి లేక ఏడాది కావస్తోంది. గతంలో ఇన్‌చార్జిగా పనిచేసిన సిద్ధలింగమూర్తి బదిలీపై వెళ్లటంతో ఆయన స్థానంలో హెచ్ఎస్ఎస్ యూనిట్-3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. మాతృసంస్థలోనే పనిభారంతో సతమతమయ్యే వీరు అదనపుశాఖల పట్ల అయిష్టంగా పనిచేస్తున్నారు. వాస్తవానికి వంద రోజుల ప్రణాళికలో భాగంగా డిసెంబరు నెలాఖరు నాటికి 6672 ఇళ్ల పూర్తి కావాల్సి ఉండగా, ఇన్‌చార్జిల పుణ్యమాని పనులు నత్తనడకన నడుస్తున్నాయి.
- జిల్లా పరిశ్రమల కేంద్రంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న మారుతీ ప్రసాద్ గత నెలలో నెల్లూరు జీఎంగా బదిలీపై వెళ్లారు అయన స్థానంలో నెల్లూరు నుంచి సుధాకర్ జీఎంగా కర్నూలుకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన మర్నాడే ఆయన సెలవుపై వెళ్లిపోయారు. ఆయన సెలవు పెట్టి 20 రోజులు దాటడంతో పాలనపరమైన వ్యవహారాలు స్తంభించిపోయాయి. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం అటకెక్కిందనే చెప్పాలి. ఉన్నతాధికారి లేకపోవటంతో ఉపసంచాలకులుగా ఉన్న ఆరుణకు ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇచ్చారు. కానీ ఇన్‌చార్జి కావటంతో ఎవరైనా పౌరసేవల నిమిత్తం కార్యాలయానికి వచ్చినా సరిగ్గా స్పందించటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏది అడిగినా ఉన్నతాధికారి సెలవులో ఉన్నారు, ఆయన వచ్చాక కలవమని దాటవేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆసౌకర్యానికి గురి అవుతున్నారు.



సీఎఫ్ బదిలీ అయినా తొలగించని నేమ్ ప్లేట్



కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం

రోడ్డు కుదింపునకు ఆమోదం



లలితా నగర్‌లోని ఓ వీధి

(7వ పేజీ తరువాయి)

నంద్యాలకు ఓ వైపు చెరువు, మరోవైపు కుందూ నది ఉండటంతో ఇంటి నిర్మాణాలకు అనువైన ప్రాంతాల్లో ఎస్బీఓస్ కాలనీ అనువుగా ఉంటుంది. ప్రస్తుతం ఇక్కడ సెంటు భూమి విలువ దాదాపు రూ.20 లక్షల పైనే ఉంటుంది. దీంతో ఎస్బీవోస్ కాలనీ లలితా నగర్‌లోని రోడ్డు కొన్ని చోట్ల 60 అడుగులు ఉంటే మరికొన్ని చోట్ల 30 అడుగులు మాత్రమే ఉంది. ఈ లెక్కన ఇక్కడి ఇంటి నిర్మాణాలు ఎంత అక్రమంగా ఉన్నదీ తెలుస్తుంది. అయినా 60 అడుగుల రోడ్డును 30 అడుగులకు కుదించేలా మున్సిపల్ కౌన్సిల్‌లో మంగళవారం ఆమోద ముద్ర వేశారు.

ఎంత డబ్బు చేతులు మారింది..?

మూడు నెలల కిందట లలితా నగర్‌లోని ఓ వ్యక్తి మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకకంగా, రోడ్డును ఆక్రమిస్తూ కడుతున్న ఇంటి నిర్మాణాన్ని తొలగించారు. దీంతో ఇక్కడి కొందరు మున్సిపాలిటీలోని ముఖ్య ప్రజాప్రతినిధులను కలిశారు. మీ ఇళ్లకు తన భరోసా ఉంటుందని అన్నారు. అయితే ఈ విషయంలో దాదాపు రూ. కోటిపైనే చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డబ్బులు చేతులు మారాయి



లలితా నగర్ రోడ్డును మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా కుదించడం పూర్తిగా అక్రమం. 60 అడుగుల రోడ్డును 30 అడుగులకు కుదిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భారీగా డబ్బులు చేతులు మారాయి. ఇందులో ఎవరెవరికి ఎంత వాటా ఉందో తెలాలి.

- మాబువలీ, టీడీపీ ఫ్లోర్ లీడర్, నంద్యాల.

ఐసీఐసీఐ బీమా కంపెనీకి వినియోగదారుల కమిషన్ వడ్డింపు

కర్నూలు లీగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పాలసీదారుడు మృతి చెందిన తర్వాత నామినీకి బీమా మొత్తం చెల్లించని ఐసీఐసీఐ బీమా సంస్థను జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. నందికొట్కూరు మండలానికి చెందిన కాశపోగు చిన్న నాగన్న 2021లో రూ.5 లక్షలకు ఒక జీవిత బీమా పాలసీని తీసుకున్నాడు. ఆయన 2022లో అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆ పాలసీలో నామినిగా ఉన్న అతని కుమారుడు శ్రీకాంత్ పాలసీ మొత్తం కోసం ఐసీఐసీఐ బీమా సంస్థకు క్లెయిమ్ దరఖాస్తు చేసుకున్నాడు. అయితే.. పాలసీదారుడు తన ఆదాయం రూ. లక్ష ఉన్నా కూడా ఎక్కువ చూపెట్టి పాలసీ పొందాడని చెబుతూ బీమా సంస్థ ఆ క్లెయిమ్ దరఖాస్తును తిరస్కరించింది. దీంతో శ్రీకాంత్ జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. కేసును విచారించిన కమిషన్ పాలసీదారుడి ఆదాయం ఏడాదికి రూ.లక్ష పైనే ఉన్నట్లు సాక్షాధారాలు ఉన్నాయని, ఫిర్యాదీకి బీమా మొత్తం చెల్లించకపోవడం సేవాలోపం అవుతుందని నిర్ధారించింది. ఐసీఐసీఐ బీమా సంస్థ ఫిర్యాదీకి పాలసీ మొత్తం రూ.5 లక్షలను 9శాతం వడ్డీతో పాటు అదనంగా మరో రూ.15వేలను కోర్టు ఖర్చులు, నష్టపరిహారం కింద చెల్లించాలని ఆదేశిస్తూ కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్లు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

మత్తు పదార్థాల నివారణే లక్ష్యం

జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్, ఎస్పీ

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల నివారణే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా పిలుపునిచ్చారు. మంగళశారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధించి జిల్లా సమన్వయ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ బిందుమాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వినియోగిస్తే వాటి వల్ల జీవితం ఏ విదంగా నాశనం అవుతుందనే వీడియోలను పాఠశాల, కళాశాల విద్యార్థులకు చూపించి అవగాహన కల్పించాలని డీఈవోను ఆదేశించారు. ఇంజనీరింగ్; మెడికల్ కళాశాలలో తప్పనిసరిగా తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. ఎస్పీ జి. బిందుమాధవ్ మాట్లాడుతూ జిల్లాలో 2019 నుంచి ఇప్పటి వరకు 96 కేసులు నమోదయ్యాయన్నారు. 65 కేసులు పెండింగ్, ట్రయల్‌లో ఉన్నాయని, 10 కేసులు చార్జిషీట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 18 కేసులు ఇంకా విచారణలో ఉండగా వీటిలో 12 కేసులకు సంబంధించి విచారణలో ఉన్నాయన్నారు. 2024లో ఏడు కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ పాల్గొన్నారు.

సహాయ సహకారాలు అందిస్తాం

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండ ర్లకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరి యంలో ట్రాన్స్‌జెండర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లందరికీ గుర్తింపు కార్డులతో పాటు అర్హులైలకు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్, ఓటరు కార్డు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌జెండర్లలో నైపుణ్యత ఉన్న వారు సొంతంగా వ్యాపారం చేసుకునేందుకు బ్యాంకు రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్, కార్పొరేషన్ల అధికారులను ఆదేశించారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లను ఎవరైనా వేధించినా, దుర్భాషలాడినా ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తామని తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా. ప్రభాకర్ రెడ్డి, డీఎంహెచ్‌వో డా. భాస్కర్, విభిన్న ప్రతిభావంతుల ఏడీ రయిస్ ఫాతిమా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతల స్వీకరణ

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన సూపరింటెండెంట్‌గా మంగళవారం సాయంత్రం సూపరింటెండెంట్ చాంబరులో బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి మధ్యాహ్నం ఉత్తర్వులు రావడంతో ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. కొత్త సూపరింటెండెంట్‌కు కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కే.చిట్టినరసమ్మ, ఆనుపత్రి ఏడీ రమేష్‌బాబు, కేఎంసీ ఏడీ అనిల్ కుమార్ రెడ్డి, ఏవో శ్రీనివాసులు, ఆఫీసు సూపరింటెండెంట్ కుమారస్వామి, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాయలసీమలోనే అతి పెద్దాసుపత్రిగా పేరొందిన కర్నూలు జీజీహెచ్ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. సెక్యూరిటి, పారిశుధ్యం పనులపై ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.



కొత్త సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపాల్

బంగారం కోసమే హత్య

- ధ్రువీకరించిన సీఐ
- ముగ్గురు నిందితుల అరెస్టు
- బంగారం, ఆయుధాలు, మోటార్‌సైకిల్ స్వాధీనం


నిందితులను మీడియాకు చూపుతున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ ఎల్లాల కొండయ్య దారుణ హత్య కేసు మిస్టరీని ఎట్టకేలకు పోలీసులు ఛేదించారు. మృత దేహం జీఎన్‌ఎస్‌ఎస్‌లో బయటపడిన రోజు ఆంధ్రజ్యోతి రాసిందే అక్షర సత్యంగా నిర్ధారితమైంది. మృతుడు కొండయ్య ఒంటిపై ఉన్న బంగారం కోసమే బెలుం శింగవరం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు, వారి కుమారుడు ఈ హత్యకు ఒడిగట్టినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు మీడియాకు వివరించారు. మంగళవారం బెలుం శింగవరం గ్రామానికి చెందిన ధనపాటి ఆనందరెడ్డి, మహేశ్వరమ్మ వృద్ధ దంపతులను, వారి కుమారుడు శ్రీనాథరెడ్డిని అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. వారి నుండి మృతుడు కొండయ్యకు చెందిన బంగారు గొలుసు, ఉంగరాలతో పాటు, దాడికి ఉపయో గించిన ఆయుధాలు, మృత దేహాన్ని తరలించడానికి ఉపయోగించిన బైకును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. శ్రీనాథరెడ్డి తీవ్ర అప్పుల్లో కూరుకుపోయి డబ్బు అవసరం కోసం కొండయ్య ఒంటిపై ఉన్న బంగారం కాజేయాలని పథకం ప్రకారమే హత్య చేశాడని సీఐ తెలిపారు.

శ్రీనాథరెడ్డి ఈనెల 25న మధ్యాహ్నం ఆర్‌ఎంపీ కొండయ్యకు ఫోన్‌చేసి తన తండ్రికి ఒంట్లో బాగాలేదని, వైద్యం చేయడానికి రావాలని పిలిచాడు. కొండయ్య మందుల బ్యాగు తీసుకొని స్కూటీపై వృద్ధ దంపతులు ఉన్న తోట వద్దకు వెళ్లాడు. చికిత్స చేస్తున్న సమయంలో వెనుక నుంచి ఆర్‌ఎంపీ కొండయ్యపై శ్రీనాథ రెడ్డి సేద్యానికి ఉపయోగించే మేడితాకతో దాడి చేసి, హత్య చేశాడన్నారు. ఒంటిపై ఉన్న బంగారం తీసుకొని, అదే రోజు రాత్రి బైక్‌పై పక్కనే ఉన్న గాలేరు నగరి కాలువలో శవాన్ని స్కూటీని వేశాడన్నారు. 26న ఉదయం మృతదేహం కాలువలో లభ్యమైందన్నారు. స్కూటీ కోసం గాలిస్తున్నామ న్నారు. కేవలం రెండున్నర తులాల బంగారం కోసమే ఆర్‌ఎంపీని హత్య చేసినట్లు నిందితులు అంగీకరించారని సీఐ రమేష్‌బాబు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- కొడుకు, కూతురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

గోనెగండ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కూతురును కర్నూలులో స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పరీక్ష రాయించేందుకు వెళ్తుండగా లింగందిన్నె క్రాస్ రోడ్డు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి కుమ్మరి హేమాంద్రి(38) మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం జరిగింది. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొనకండ్ల గ్రామానికి చెందిన హేమాంద్రి తన కూతురు త్రివేణిని స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్ష రాయించేందుకు సోమవారం కొనకండ్ల నుంచి కర్నూలుకు బయలుదేరారు. పత్తికొండలో హేమాంద్రి స్నేహితుడు ఉండటంతో రాత్రి ఉండి మంగళవారం ఉదయం స్నేహితుడి కారు (ఏపీ21సీఈ8551)తీసుకొని కూతురు, కుమారుడితో కర్నూలుకు బయలుదేరారు. మార్గమధ్యంలో లింగందిన్నె క్రాస్ రోడ్డు దగ్గర పక్కవైపు నుంచి అతి వేగంగా వచ్చిన లారీ(టీఎస్ 12ఈక్యూ 9558) రోడ్డుపై వెళుతున్న కారును వెనుక వైపు ఢీ కొట్టింది. అందులో ఉన్న హేమాంద్రి తలకు, భుజానికి తీవ్రగాయాలై తీవ్రరక్తస్రావం జరిగింది. కర్నూలు జీజీహెచ్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ హేమాంద్రి మృతి చెందాడు. కూతురు, కుమారుడు, కారుడ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుని భార్య జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

- డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రానుందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ కాంగ్రెస్ కార్యాలయంలో నంద్యాల జిల్లా కాంగ్రెస్ శ్రేణులతో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కో ఆర్డినేటర్ పలక్‌వర్మ సమీక్ష నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ జిల్లాల వారీగా కాంగ్రెస్ బలోపేతానికి సమావేశాలు నిర్వహించడం, కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవానికి దారితీస్తుందన్నారు.

నంద్యాల జిల్లాలో నియోజకవర్గ ఇన్‌చార్జులు సమన్వయంతో పనిచేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు సాధిస్తుం దన్నారు. పార్టీకోసం పనిచేసేవారికి ప్రాధాన్యముంటుదన్నారు. నంద్యాల పార్లమెంటులో బీసీలు, ఎస్సీలు, మైనార్టీలు అధిక సంఖ్యలో ఉన్నారని, నియోజకవర్గ కో ఆర్డినేటర్లను నియమిస్తే వారి సమన్వయంతో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయనున్నట్లు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అలీఖాన్, అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

లారీ, మినీ వాహనం బోల్తా..

డోన్ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం లారీ, ఓ మినీ వాహనం బోల్తా పడింది. ఈ సంఘటన చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బెంగుళూరు నుంచి హైదరాబాదు వైపునకు వెళ్తున్న తమిళనాడుకు చెందిన లారీ ఆయిల్ ట్యాంకర్ వెళ్తున్న వాహనం, టెంకాయల లోడుతో వెళ్తున్న మినీ వాహనం డోన్ హైవే రోడ్డుపై వెళ్తూ ఒకదానికి ఒకటి క్రాసింగ్ చేసే సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పట్టణ పోలీసులు తెలిపారు. టెంకాయల లోడుతో వెళ్తున్న మినీ వాహనం, తమిళనాడు చెందిన లారీలు అదుపు తప్పి బోల్తా పడ్డాయి. అదే సమయంలో ముందు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీ రోడ్డు దాటి రూరల్ పోలీస్ స్టేషన్ వైపున దూసుకెళ్లి ఆగిపోయింది. ప్రమాదంలో డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. భారీ ప్రమాదం తప్పడంతో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అప్రమత్తమైన పోలీసులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా క్రేన్ సాయంతో బోల్తా పడిన వాహనాలను పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బోల్తా పడిన వాహనం

సమస్యలు పరిష్కరించండి

డ్వామా ఇన్‌చార్జి పీడీకి నాయకుల వినతి

కర్నూలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కర్నూలు జిల్లా టెక్నికల్ అసిస్టెంట్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు యు.తిరుమలేశ్ కోరారు. మంగళవారం డ్వామా ఇన్‌చార్జి పీడీ నాసరరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమలులో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రాజకీయ ఒత్తిళ్లను ఇన్‌చార్జి పీడీకి వివరించారు. ఈ సందర్భంగా తిరుమలేశ్ మాట్లాడుతూ గ్రామాల్లో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు పని ఒత్తిడి, చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ రాజకీయాలు కారణాలతో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను లక్ష్యంగా చేసుకుని సామాజిక తనిఖీల పేరిట టెక్నికల్ అసిస్టెంట్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. గ్రామ స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి మండల స్థాయిలో ఎంపీడీవోల వరకు బాధ్యత ఉందని, ఏ సమస్య వచ్చినా ఎస్‌ఆర్‌డీఎస్-2012 రూల్స్ ప్రకారం నిర్ణయం తీసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మధుశేఖర్, కోశాధికారి బషీర్ అహ్మద్, నాయకులు ఎం.ఆనంద్, సువర్ణలత, జ్యోతి, రేణుక, మల్లికార్జున, మహేష్ పాల్గొన్నారు.


వినతి పత్రం ఇస్తున్న టెక్నికల్ అసిస్టెంట్స్ నాయకులు

31లోగా నవోదయకు దరఖాస్తు చేసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో చేరే విద్యార్థులు అక్టోబరు 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మావతి మంగళవారం తెలిపారు. 9వ తరగతి అభ్యర్థులు 2024-25లో 8వ తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతూ ఉండాలన్నారు. అలాగే 11వ తరగతి విద్యార్థులు సైతం 2024-25వ సంవత్సరంలో 10వ తరగతి ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతుండాలన్నారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. చివరి తేదీ అక్టోబరు 30 ఉండగా ఎంపిక పరీక్ష 08-02-2025 శనివారం ఉంటుందన్నారు. వివనాలరే ఫోన్ 08512-294545తో సంప్రదించాలని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

నంద్యాల క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సలీం నగర్‌కు చెందిన ఫరూక్ (33) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఫరూక్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా నంద్యాల రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పేదలకు మూడు సిలిండర్లు ఉచితం


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని రేషన్ కార్డు కలిగిన పేదలకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తుందని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గ్యాస్ ఏజెన్సీల డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆదాయ పన్ను చెల్లించేవారు, మున్సిపాలిటీలో వెయ్యి చదరపు అడుగుల ఇంటికి పన్ను చెల్లిస్తూ ఉంటే.. నాలుగు చక్రాల మోటారు వాహనం ఉన్నవారు, 300 యూనిట్లు కరెంటు బిల్లు దాటిన వారు, మూడెకరాల తడి పొలం లేదా 10 ఎకరాల మెట్ట పొలం కలిగి ఉన్న వారు ఈ పథకానికి అనర్హులు అన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ రాజా రఘువీర్, గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్త సూపరింటెండెంట్‌కు అభినందనలు


సూపరింటెండెంట్‌కు పూలబొకే ఇస్తున్న దినేష్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కొత్త సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన కే.వెంకటేశ్వర్లుకు అనస్థీషియా టెక్నీషియన్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.దినేష్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పది ఆపరేషన్ థియేటర్లు, నాలుగు ఐసీయూలు ఉన్నాయని, ఇందుకుగానూ కేవలం ఐదుగురు అనస్థీషియా టెక్నీషియన్లు మాత్రమే ఉన్నారని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. టెక్నీషియన్ల సంఖ్యను పెంచాలని సూపరింటెండెంట్‌ను కోరారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట: ఎమ్మెల్యే


రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, జాయింట్ కలెక్టర్ బి.నవ్య

కల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం కల్లూరు మండలం పెద్దటేకూరులో తహసీల్దారు కె. ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో జాయింట్ కలెక్టర్ బి.నవ్యతో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూ రీసర్వేలో అనేక తప్పులు చోటు చేసుకున్నాయని రైతుల సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు గ్రామసభలకు శ్రీకారం చుట్టారని అన్నారు. రెవెన్యూ గ్రామసభలో వచ్చిన ప్రతి అర్జీకి అధికారులు పరిష్కారం చూపుతారన్నారు. పెద్దటేకూరులో శ్మశాన వాటిక సమస్య, ఇళ్ల స్థలాలకు వెళ్లేదారి బాగుచేయాలని, వాటర్‌షెడ్ నిర్మాణాలు చేయాలని తెలిపారని త్వరలో వాటిని పరిష్కరిస్తామన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ బి.నవ్య మాట్లాడుతూ భూ వివాదాల పరిష్కారమే రీసర్వే లక్ష్యమన్నారు. గ్రామంలో 2763 ఎకరాల భూమి ఉండగా రీసర్వేలో కేవలం 88 సెంట్లు మాత్రమే వ్యత్యాసం వచ్చిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే, జేసీ రైతుల నుంచిఅర్జీలు స్వీకరించారు. రైతుల నుంచి మొత్తం 165 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, ఏపీ ఫైనాన్స్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనుయులు, మాజీ ఎంపీటీసీ యాగంటయ్య, సర్పంచు పద్మావతి, ఎంపీటీసీ మునిస్వామి, టీడీపీ నాయ కులు సాయి తరుణ్‌రెడ్డి, రఘురాముడు, వెంకటేష్, దొడ్డిపాడు బాషా పాల్గొన్నారు.

రోడ్డు పక్క వ్యాపారులపై చర్యలు తీసుకోండి

కర్నూలు మున్సిపల్ కమిషనర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం

కర్నూలు లీగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు కర్నూలు ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని రోడ్డు సైడు వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్‌కు రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ జాయిం ట్ కమిషనర్ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో కొంత మంది వ్యక్తులు రోడ్డు సైడు వ్యాపారాలు చేసుకోవడానికి గతంలో లైసెన్సులు పొందారు. ఆ లైసెన్సుల కాలపరిమితి ముగియడంతో వాటిని రెన్యువల్ చేయాలని వ్యాపారులు మున్సిపల్ కార్పొరేషన్‌కు దర ఖాస్తు చేసుకున్నారు. అయితే.. మున్సిపల్ అధికారులు ఆ ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా ప్రకటించడంతో వ్యాపారుల లైసెన్సులను పునరుద్ధరించక ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని వ్యాపారులను ఆదేశించారు. దీంతో ఆ ప్రాంతంలో రోడ్డు సైడు వ్యాపారాలు చేసుకుంటున్న చాకలి మహేష్, తెలుగు లక్ష్మీదేవి వేర్వేరుగా రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు.

దీనిపై రాష్ట్ర హైకోర్టు తీర్పునిస్తూ వ్యాపారులపై మున్సిపల్ అధికారులు నియమ నిబంధనల మేరకే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు కర్నూలు మున్సిపల్ అధికారులు హైకోర్టు తీర్పును దృష్టిలో పెట్టుకుని చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

'పొలం పిలుస్తోంది' వినియోగించుకోండి: జేడీ

కర్నూలు రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులంతా వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి సూచించారు. కర్నూలు మండలం ఉల్చాల, తొలిషాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జేడీ పత్తి పంటలో తెగుళ్ల నివారణతో పాటు గులాబి రంగు పురుగు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కర్నూలు ఏడీఏ శాలురెడ్డి, ఎల్డీఎం లక్ష్మణ్, ఏవో రూపన్, ఏఈవో మోహన్ పాల్గొన్నారు.

డోన్ పోలీసులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు లీగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డోన్ బార్ అసోసియేసన్ సభ్యుడు ఎస్.శ్రీనివాసులుపై డోన్ పోలీసులు దాడి చేసి గాయపరిచినందుకు వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కర్నూలు బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బార్ అసోసియేషన్‌లో వారు మాట్లాడుతూ డోన్ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ, పోలీసు సిబ్బంది న్యాయవాది శ్రీనివాసులును అకారణంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అతనిని కొట్టి గాయపరిచారని, దాడికి పాల్పడిన పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై తాము ఇదివరకే ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినా కూడా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, దానికి నిరసనగా వచ్చే నెల 1వ తేదీన తాము కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవి గువేరా, కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు కే.మోహన్‌బాబు, నిత్యజీవన్ రాజు, రాజేష్, ఎం.జగదీష్ పాల్గొన్నారు.

ఎకోమిషన్ టెండర్ దాఖలకు గడువు పొడిగింపు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కలర్ డాప్లర్ 2డీ ఎకో కార్డియోగ్రఫీ మిషన్ ఒకటి కొనుగోలు కోసం పిలిచిన టెండర్ గడువును ఈ నెల 8వ తేదీ వరకు పొడిగించినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.చిట్టినరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. టెండరు గడువు మంగళవా రంతో ముగియడం ఒకరే టెండరుకు దరఖాస్తు చేయడంతో జాయింట్ కలెక్టర్, డీసీపీ ఆదేశాల మేరకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. కర్నూలు మెడికల్‌కాలేజీ.ఏసీ.ఇన్‌లో, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కర్నూలు.ఏపీ.జీవో వి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కర్నూలు క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో నందికొట్కూరు రహదారిలో చెక్‌పోస్టు సమీపంలో మిల్క్ డెయిరీ వాహనం ఢీకొని రమణమ్మ (57) మృతి చెందింది. వగిడ్యాల మండలం నెహ్రూనగర్‌కు చెందిన రమణమ్మ టెలికాం నగర్‌లో కొడుకు దగ్గర ఉంటుంది. మంగళవారం కొడుకుతో కలిసి మోటారు సైకిల్‌పై చెక్‌పోస్టు నుంచి నందికొట్కూరు వైపు వెళ్తుండగా.. చెక్‌పోస్టు సమీపంలో వీరి మోటారు సైకిల్‌ను మిల్క్‌డైరీ వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరు కింద పడ్డారు. ఈ ప్రమాదంలో రమణమ్మ తలపై మిల్క్ డెయిరీ వ్యాన్ టైరు వెళ్లడంతో తీవ్రగాయాలపాలైంది. ఆసుపత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

కర్నూలు క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సత్యసాయి నగర్‌లో మధుసూదన్‌రావు అనే ఉపాధ్యాయుడు ఇంట్లో చోరీ జరిగింది. మధుసూదన్ రావు దంపతులు ఇద్దరు టీచర్లే. సోమవారం వీరు విధులకు వెళ్లి సాయంత్రం వచ్చి చూస్తే ఇంట్లో ఉన్న 2 తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. మరి కొంత సొమ్మును రహస్యంగా దాచడంతో ఆ సొత్తు సేఫ్‌గా మిగిలింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నాలుగో పట్టణ పోలీసులు, సీసీఎస్ పోలీసులు మంగళవారం వీరింటికి వెళ్లి వివరాలు సేకరించారు. ఇదే కాలనీలో మరో ఉపాధ్యాయుడు యాపిలయ్య ఇంట్లో కూడా చోరీ జరగడం గమనార్హం. ఈ రెండు ఘటనలో ఒకే నిందితుడు ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

ఏఎంసీ, క్యాజువాల్టీ తనిఖీ


ఏఎంసీలో వైద్యులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కే.వెంకటేశ్వర్లు ఏఎంసీ, క్యాజువాల్టీ వార్డులను మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. ముందుగా క్యాజువాల్టీ విభాగంలో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీశారు. అనంతరం ఏఎంసీకి చేరుకుని అక్కడ విధులు నిర్వహిస్తున్న డ్యూటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మీనుగ శ్రీనివాసులుతో మాట్లాడారు. రోగులు ఎంత మంది ఉన్నారు..? పడకలు సమస్యలు ఏమైనా ఉందా..? అని ప్రశ్నించారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూపరిం టెండెంట్ ఆదేశించారు. సూపరింటెండెంట్ వెంట హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్ శివబాల, డాక్టర్ కిరణ్ కుమార్, క్యాజువాల్టీ సీఎంవో డాక్టర్ శ్వేత ఉన్నారు.

లోక్ అదాలత్ న్యాయాధికారిని కలిసిన కమిషనర్

కర్నూలు లీగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్ న్యాయాధికారి బి.లీలా వెంకట శేషాద్రిని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మంగళవారం లోక్ అదాలత్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందజేశారు. కోర్టుల్లో ఉన్న నగర పాలక సంస్థపై ఉన్న కేసుల గురించి వారు చర్చించారు.

స్క్రీనింగ్ టెస్టును పకడ్బందీగా నిర్వహించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఉచిత మెగా డీఎస్సీ పొందే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు నవంబరు 3న నిర్వహించే స్క్రీనింగ్ టెస్టును పకడ్బందీగా నిర్వహించాలని ఆయా కేంద్రాల కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మీదేవి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు, కళాశాలల ప్రిన్సిపాల్స్ ల్యాబ్ టెక్నీషియన్లతో జేడీ సమావేశం నిర్వహించారు.

నివేదికలు ఇవ్వండి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో అనధికార భవనాలు, రోడ్డు ఆక్రమణాలపై నివేదికలు ఇవ్వాలని కమిషనర్ సిటీ ప్లానర్‌కు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన పైసల ప్లానింగ్ కథనానికి కమిషనర్ స్పందించారు.

'ఆంక్షలు ఎత్తివేయాలి'

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): క్యూబాపై అమెరికా విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గడియారం ఆసుపత్రి వద్ద క్యూబాకు సంఘీభావ కార్యక్రమాన్ని చేపట్టారు.

కర్నూలు నియోజకవర్గ ఓటర్ల జాబితా ప్రచురణ

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్పెషల్ సమ్మరీ రివిజన్- 2025లో భాగంగా కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబందించిన సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారులు ప్రచురించారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, తహసీల్దార్ వెంకటలక్ష్మిలు ముసాయిదాలను ప్రచురించి రాజకీయ పార్టీలకు కాపీలను అందజేశారు. సూపరింటెండెంట్ సుబ్బన్న, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'కొత్త చిత్రాలకు ప్రేక్షకుల ప్రోత్సాహం అవసరం'


మాట్లాడుతున్న చంద్రారెడ్డి

కర్నూలు కల్చరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కొత్త చిత్రాలకు ప్రేక్షకుల ప్రోత్సాహం అవసరమని జిల్లాకు చెందిన సీనియర్ చిత్ర నిర్మాత ఆర్ చంద్రా రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని మౌర్యఇన్‌లోని భరత్ థియేటర్‌లో నడుస్తున్న రంగస్వామి చిత్రాన్ని దర్శకుడు కె.నర్సింహ, సీనియర్ నటుడు మీనాక్షిరెడ్డి, ఇతర నటీనటులతో కలిసి ఆయన వీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన యువ దర్శకులు ఇప్పుడిప్పుడే సినీ రంగంలో రాణిస్తున్నారని, వారికి తమ సహకారం అందిస్తామన్నారు.

దీపావళిని ఆనందంగా జరుపుకోవాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్


టీజీ వెంకటేశ్‌కు టపాసులను అందజేస్తున్న దుకాణాదారులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలంతా దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. మంగళవారం నగరంలోని ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను ఆయన ప్రారంభించారు. మైదానంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను, క్రాకర్స్‌ను పరిశీలించారు. దుకాణదారులతో అమ్మకాల తీరును విచారించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అవినీతి నాయకుల వల్ల బాణసంచా దుకాణాలకు రూ.30వేలు ఆదాయం వస్తే రూ.40 వేలు లంచాలకే చెల్లించాల్సి వచ్చేదని అన్నారు. బాణసంచా దుకాణదారులు మంత్రి టీజీ భరత్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించడంతో వారికి ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తానికే షాపులు పెట్టుకునేలా ఏర్పాట్లు చేశారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సూర్యప్రకాశ్, బాణసంచా దుకాణాల అసోసియేషన్ నాయకులు సందీప్, కృష్ణ, లవకుమార్ పాల్గొన్నారు.

పర్యావరణహిత దీపావళిని జరుపుకుందాం


మాట్లాడుతున్న కిషోర్‌రెడ్డి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణహిత దీపావళిని జరుపుకుందామని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ పీవీ కిషోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని చెన్నమ్మ కూడలిలోని జడ్పీ పాఠశాల, ఎ.క్యాంపు సమీపంలోని ఇందిరాగాంధీ స్మారక పాఠశాలలో పర్యావరణ హిత దీపావళిపై విద్యార్థులకు అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ హరిత టపాసులతో శబ్ద, వా యుకాలుష్యం తగ్గి, పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతోందన్నారు. అనం తరం విద్యార్థులకు మట్టి ప్రమీదలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమం లో సహాయ ఇంజనీర్ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు మండ్ల వెంకటేశ్వర్లు, నాగ శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయండి


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు

ఓర్వకల్లు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ సునీల్ కుమార్ సహకారంతో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మల్లెల రాజశేఖర్, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఓర్వకల్లు, ఉలింద కొండ, నాగలాపురం ఎస్ఐలు సునీల్ కుమార్, ధనుంజయ్, ఆశాలత, నాయ కులు గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, బ్రాహ్మ ణపల్లె నాగిరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, తిప్పాయపల్లె సుధాకర్ రెడ్డి, మౌళీశ్వర రెడ్డి, వైద్యులు ఎస్ఎండీ యూసుఫ్, రమణ, కాంతయ్య, పోలీసులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

కర్నూలు క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మట్కా చీటీలతో పాటు 20 లీటర్ల నాటుసారా, రూ.50వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

పనిభారం తగ్గించాలి


వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

వెల్దుర్తి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి)29: తమకు పనిభారాన్ని తగ్గించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ మంగళవారం డిమాండ్ చేశారు. నవంబరు 1వ తేదీ నుంచి మూడేళ్లలోపు పిల్లలకు ఈకేవైసీ ఫో టోలు తీసి ఇవ్వలే మన్నారు. వేతనాలు పెంచాలని కోరారు. సీడీపీవో లూక్‌కు వినతిపత్రం అందజేశారు. శిరీష, కామేశ్వరి, విజయకుమారి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

మద్దికెర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జడ్పీ బాలికల పాఠశాల 1986-87 పదోతరగతి పూర్వ విద్యార్థులు రూ.2.30 లక్షలతో మూత్రశాల నిర్మాణానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. 300 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారని, మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హెచ్‌ఎం దేవేంద్రప్ప త్వరలోనే వీటిని పూర్తి చేసి విద్యార్థినులకు ఉపయోగిస్తామని తెలిపారు.

గుప్తాను అభినందించిన సబ్ కలెక్టర్

ఆదోని టౌన్, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి): డాక్టరేట్ పొందిన సామాజిక సేవా కార్యకర్త వంకదారు శ్రీనాథ్ గుప్తాను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మంగళవారం అభినందించారు. సేవా కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు

టీడీపీ సభ్యత్వంతో రూ.5లక్షల బీమా


సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న ఉమాపతి నాయుడు

ఆదోని, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో రూ.5లక్షల బీమా వస్తుందని టీడీపీ సీనియర్ నేత ఉమాపతి నాయుడు అన్నారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు బైచిగేరి, దొడ్డనగేరి గ్రామాలలో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. రామస్వామి, ధనాసింగ్, రాముడు, రామన్న, బోయ బాలు, గిరిరాజ్ సింగ్, భాస్కర్ సింగ్, చిన్నస్వామి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో భరోసా

తుగ్గలి: టీడీపీ సభ్యత్వం తీసుకుంటే పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు, రామచంద్ర, మునెప్ప అన్నారు. మంగళవారం ముక్కెళ్ల గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. లక్ష్మణస్వామి, బాలు, విద్యాకమిటి చైర్మన్ మల్లికార్జున, రాముడు, ముని తదితరులు పాల్గొన్నారు.


తుగ్గలి: ముక్కెళ్లలో సభ్యత్వ నమోదు

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


ఉమాపతి నాయుడు సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

ఆదోని, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైచిగేరి గ్రామ వైసీపీ నాయకులు టీడీపీ నాయకుడు ధనాసింగ్ ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు కండువా వేసి పార్టీలోకి ఆహ్వా నించారు. ఉమాపతి నాయుడు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందలేదని, కూటమి ప్రభుత్వం రాగానే నిధులు విడుదల చేసి అభివృద్ధికి పునాదులు వేస్తున్నామన్నారు. వైసీపీ హయాంలో పంచాయతీలకు నిధులు ఇవ్వలేదని గుర్తు చేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని అన్నారు. టీడీపీలో చేరిన వారిలో బోయ రాముడు, తిమ్మన్న, లక్ష్మన్న, వెంకటేష్ పౌలు ఉన్నారు.

మినీ రిజర్వాయర్లు నిర్మించాలి


• సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

జొన్నగిరి చెరువును పరిశీలిస్తున్న రామకృష్ణ

తుగ్గలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ నియోజకవర్గంలో మినీ రిజర్వాయర్లు నిర్మించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మంగళవారం జొన్నగిరి చెరువు, ఆయకట్టు ప్రాంతాన్ని పరిశీలించారు. జొన్నగిరి గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉంటుందని, చెరువులో నీరు లేకుంటే భూగర్భజలాలు లేక పంటలు ఎండి బీడుగా మారతాయని ఆవేదన వ్యక్తం చేశారు. జొన్నగిరి చెరువు కింద 266 ఎకరాలు సాగు చేసేందుకు అవకాశం ఉందన్నారు.

పొలాల్లో కంపను తొలగించాలని జొన్నగిరి చెరువుకు హంద్రీనీవా నీటిని మళ్లించా లన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్, జాఫర్, జిల్లా కార్యవర్గ సభ్యులు నబీరసూల్, మండల కార్యదర్శి సుల్తాన్, ఎంపీపీ ఎర్రనాగప్ప, రఘు, తదితరులు ఉన్నారు.

నిర్మాణాలకు నిధులు కేటాయించండి


మంత్రి సత్యప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

ఆదోని, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పార్థసారథి కోరారు. మంగళవారం రెవెన్యూ, స్టాంపుల శాఖ మంత్రి సత్యప్రసాద్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్ కలెక్టర్, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరాయన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే అన్నారు.

కబడ్డీ పోటీలకు ఆదోని క్రీడాకారులు

ఆదోని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ సౌత్ జోన్ కబడ్డీ టోర్నమెంటుకు ఆదోని క్రీడాకారులు ఎంపిక అయ్యారు. ఆర్ట్స్ కళాశాల డిగ్రీ విద్యార్థులు సతీష్, అవినాష్, జ్యోతిర్మయి కళాశాల విద్యార్థి జమ్మన్న ఎంపికయ్యారు. వీరు చెన్నైలో ఈనెల 30వ తేదీ నుంచి 3వ తేదీ వరకు సౌత్‌జోన్ కబడ్డీ టోర్నమెంట్‌లో ఆడతారు. ఆర్ట్స్ కాలేజీ పీడీ ఎర్రి స్వామి, కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఫిలిప్స్‌కు ఆదోని కబడ్డీ టీంకోచ్ ఎస్ అమర్ ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు.


ఎంపికైన విద్యార్థులు

జీవో 77 రద్దు చేయాలి


పోస్టర్ విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మద్దికెర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవో.నెం.77ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, మండల కార్యదర్శి జశ్వంత్ డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ ఆదోనిలో నవంబరు 12, 13 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ 30వ మహాసభలను నిర్వహిస్తునానమన్నారు. విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలు మూతపడ్డాయని, తక్షణమే జాతీయ నూతన విద్యావిదానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తిప్పన్న, వేణు, జగన్, అనిల్, రంగన్న ఉన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి: పీఆర్ ఎస్ఈ

ఆదోని, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి): గ్రామీణ రోడ్ల నిర్మాణంలో ఇంజనీర్లు బాధ్యతగా పనులు చేయించాలని పంచాయతీ రాజ్ సూరింటెండెంట్ ఇంజనీర్ రామచంద్ర ఆదేశించారు. మంగళవారం ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించిందన్నారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని, నిర్లక్ష్యం వహించొద్దని వారిని హెచ్చరించారు. అనంతరం ఆదోని డీఈ ఈరన్న ఇంజనీర్లకు రోడ్ల నిర్మాణం, భద్రత నాణ్యత ఎం.బుక్‌పై శిక్షణ ఇచ్చారు. ఈఈ వెంకటేశ్వర్లు, ఆదోని మంత్రాలయం ఎమ్మిగనూరు డీఈలు రంగస్వామి, చంద్రశేఖర్, రాణి, మనోహర్ పాల్గొన్నారు.

చిన్నారులకు యూట్యూబర్ సాయం


నగదును చిన్నారులకు అందచేస్తున్న యూట్యూబర్ రవి

పత్తికొండ, అక్టోబరు 29: తల్లిదండ్రులను కోల్పోయిన చందోలి గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులకు చక్కరాళ్ల గ్రామానికి చెందిన యూట్యూబర్ రవి మంగళవారం రూ.51వేల ఆర్థిక సాయం చేశారు. రవి మాట్లాడుతూ చిన్నారుల పరిస్థితిపై ఇన్‌స్టాగామ్‌లో వీడియో చేశానని, స్పందించిన దాతలు ఆర్థిక సాయం పంపారని వీటిని చిన్నారులకు ఇచ్చానని అన్నారు.

రీయింబర్సుమెంట్ విడుదల చేయాలి

ఆస్పరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం పునఃప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రవి, రంగప్ప, వినోద్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. నవంబర్ 6న చలో కలెక్టరేట్ నిర్వహిస్తామన్నారు.

'సరుకులను సక్రమంగా సరఫరా చేయండి'



ప్రభుత్వ పౌరసరఫరాల గోదాములో సరుకులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఎమ్మిగనూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వం పంపిణీ చేసే నిత్యావసర సరుకులను సక్రమంగా సరఫరా చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం మంత్రాలయం రోడ్డులో ఉన్న ప్రభుత్వం పౌరసరఫరాల గోదాంను సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గోదాంలో ఉన్న రేషన్ నిల్వలను, రికార్డులను పరిశీలించారు. నిత్యావసర సరుకులు రేషన్ కార్డుదారులకు సక్రమంగా అందేలా చూడాలన్నారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ శేషఫణి, డీటీ మహేష్ ఉన్నారు.

భూసమస్యలు పరిష్కరిస్తాం: సబ్ కలెక్టర్

మంత్రాలయం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు గ్రామ సభల ద్వారా పరిష్కరించనున్నట్లు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో రెవెన్యూ గ్రామ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో మంత్రాలయం తహసీల్దార్ రవి, న్యాయవాది విజయకుమార్, మండల సర్వేయర్ అశోక్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాసరాజు, ఆర్ఐ ఆదాం, వీఆర్వోలు నరసప్ప, సర్వేయర్లు, తిమ్మేష్, ఉరుకుందాచారి, నవీన్ కుమార్, అనూష, శోభ, కీర్తి, వీఆర్వోలు ఆనందం, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆర్టీసీని అభివృద్ధి బాటలో నడుపుతాం

సీఎంఈ విజయ్‌రత్నం



పెట్రోల్ కొలతలు పరిశీలిస్తున్న సీఎంఈ విజయ్‌రత్నం

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఆర్టీసీని అభివృద్ధి బాటలో నడుపుతామని సీఎంఈ విజయ్‌రత్నం అన్నారు. మంగళవారం ఏపీఎస్ఆర్టీసీ కార్యాలయాన్ని విజయవాడ నుంచి వచ్చిన చీఫ్ మెకానికల్ ఇంజనీర్ విజయ్‌రత్నం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఆర్టీసీ పని తీరు ఇంకా మెరుగు పరుచుకోవలసిన అవసరం ఉందని అన్నారు. మెకానిక్‌ల, బస్సుల పని తీరు, డ్రైవర్లు ఆయిల్ టార్గెట్ వాడకంపై, సిబ్బందిపై పర్యవేక్షణ చేయాలన్నారు. మెకానిక్‌లకు, డ్రైవర్లకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ట్రైనింగ్ క్యాంప్‌లు నిర్వహించి పని తీరును మెరుగుపరిచే విధంగా ముందుకు వెళ్తామన్నారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ విద్యార్థులు ఒక్కరు ఉన్న అ రూట్‌లో బస్సు నడపాల్సిందే అని అన్నారు. తొలగించిన లాంగ్ సర్వీసులు కూడా పునఃప్రారంభిస్తామని అన్నారు. సమస్యలను పరిష్కరించి ప్రజలకు మంచి ప్రయాణం, సర్వీస్ అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో సీఎండీ హరినాథ్ బాబు, ఎమ్మిగనూరు డిపో మేనేజర్ అమర్‌నాథ్, కర్నూలు రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపండి: ఎస్ఈ



పిచ్చిమొక్కలు పెరిగిన ఎల్లెల్సీ కాలువ గట్టును పరిశీలిస్తున్న ఎస్ఈ

గోనెగండ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు కాలువల గట్లు దెబ్బతిన్నాయని, అలాగే ఎస్కేప్ చానల్‌లు ఇతరత్రా పనులు ఏమైనా జరగాల్సి ఉంటే వాటికి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం గోనెగండ్ల మండల పరిధిలోని తుంగభద్ర దిగువకాలువ గట్లు, గోనెగండ్ల దగ్గర ఉన్న ఎల్లెల్సీ ఎస్కేప్ చానల్‌ను, 4/7టైల్‌డ్యామ్‌ను, గాజులదిన్నె ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల గట్లను ప్రాజెక్టునుంచి పలు ప్రాంతాలకు వెళ్లే తాగునీటి పథకాలను ఎస్ఈ పరిశీలించారు. ఎక్కడ కాలువ గట్లు దెబ్బతిన్నాయో అక్కడ ఎంత మేర పనులు చేపట్టాలి అందుకు సంబంధించిన ఎస్టిమేషన్ తయారుచేసి పంపాలని ఆదేశించారు. ఈఈ శైలేశ్వర్, డీఈ విద్యాసాగర్, ఏఈ ఉదయ్‌భాస్కర్, రవి, జీడీపీ, ఎల్లెల్సీ అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించండి

గోనెగండ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారానే పత్తి విక్రయించాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దనేలటూరు గ్రామంలో పొలం పిస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ శివార్లలోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు డివిజన్‌లో రబీసీజన్‌లో పప్పుశనగ పంటను రైతులు అధికంగా సాగు చేస్తారని అన్నారు. విత్తనం విత్తిన 24 గంటలలోపు ఎకరానికి 1.2 లీటర్ల పెండిమిథాలిన్ కలుపు మందును పిచికారి చేయాకుంటే కలుపును నివారించొచ్చన్నారు. 30 రోజులు కలుపు లేకుండా చూసుకోవాలని సూచించారు. పంటల బీమా కోసం రైతులు ఎకరానికి శనగకు రూ.230, వేరుశనగకు రూ.290, మిరపకు రూ.525, మొక్కజొన్నకు రూ.297 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బసరాజు స్వామి, వీరన్నగౌడ్, శేషప్పనాయుడు, శిల్పి శ్రీనివాసులు, గొల్లరాముడు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ద్వాదశి వేడుకలు

మంత్రాలయం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు పల్లకిలో విహరించారు. మంగళవారం కార్తీక ద్వాదశి వేడుకలను పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో మంత్రాలయం వీధులు కిక్కిరిశాయి.

అన్నదానానికి రూ.లక్ష విరాళం: రాఘవేంద్రస్వామి మఠానికి చెన్నైకి చెందిన రవీంద్ర రమణాదేవి అనే భక్తురాలు మంగళవారం రూ.లక్ష అన్నదానానికి విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషిలు తెలిపారు. దాతకుటుంబానికి పీఠాధిపతి ఆశీర్వదించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో విజయ డెయిరీ ఎండీ



మంత్రాలయం ప్రాంగణంలో విజయ డెయిరీ ఎండీ ప్రసన్నకుమార్

మంత్రాలయం, అక్టోబరు 29: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం విజయడైయిరీ ఎండీ ప్రసన్నకుమార్ మంగళవారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్ వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట ఏఏఓ మాధవశెట్టి, సూపరింటెండెంట్ అనంతపురాణిక్, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ తదితరులు ఉన్నారు.

ఎమ్మిగనూరులో కార్డన్ సెర్చ్

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శక్తినగర్‌లో డీఎస్పీ ఉపేంద్ర బాబు ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుఝామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నాటు సారా, అక్రమ మద్యం, గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలన కోసం అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. అనుమానాస్పద వస్తువులు, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. రౌడీషీ టర్ల కదలికలను, ప్రస్తుతం వారు చేస్తున్న పనుల గురించి వాకబు చేశారు. కార్యక్రమంలో సీఐలు సుదర్శన్ రెడ్డి, విక్రమ్ సింహ, ఎస్ఐలు డాక్టర్ నాయక్, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఎమ్మిగనూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు సత్యన్న, బాలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం దగ్గర ఆందోళన నిర్వహించారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులకు సమస్యలు విన్నవించి వినతిపత్రం అందజేశారు. నాయకులు బాబు, రాజు, అంజి, ఎల్లప్ప, మనోజ్, దినకర్, భాస్కర్, ఖాజా, రాముడులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయాన్ని పెంచాలి: డీఎల్‌పీవో

గోనెగండ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో చెత్త సంపద కేంద్రం నుంచి వర్మికంపోస్టు ఎరువు తయారు చేసి విక్రయించి ఆయా గ్రామాల పంచాయతీ ఆదాయాన్ని పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని ఆదోని డీఎల్‌పీవో నూర్జహన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈవో ఆర్డీ అనంతశయన, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలను తొలగించాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాలను తొలగించాలని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వాణమ్మ, ఈరమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను రాష్ట్రంలో అధికంగా ఏర్పాటు చేసిందన్నారు. అయితే ఈ దుకాణాలు జనావాసాల మధ్యలో ఏర్పాటు చేయడంతో ప్రజలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనావాసాల మధ్య ఉన్న దుకాణాలను మార్చకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాగవేణమ్మ, ఉరుకుందమ్మ, వెంకటలక్ష్మీ, సరోజా, ఈరమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పెద్దకడబూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో బాలిక అదృశ్యమైనట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గ్రామంలోని బాలిక సోమవారం రాత్రి 7గంటలకు బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు గాలించినప్పటికి ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని ముస్కాన్‌తో ఉపాధ్యాయులు

మంత్రాలయం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ అండర్-14 పోటీలకు మంత్రాలయం ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ ముస్కాన్ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం హంపయ్య, ఫిజికల్ డైరెక్టర్లు నరసింహరాజు, బసవరాజులు తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణంలో విద్యార్థినిని అభినందించారు. వచ్చే నెల జమ్ముకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విఠోభరావు, చంద్రశేఖర్, రామన్న, నాగభూషణం, గోపాల్, ఉమామహేశ్వరి, పుష్పలత, సత్యనారాయణ, శివశంకర్, ప్రసన్నకుమారి, అనిల్, వీరేష్‌రావు, సంధ్యారాణి, శ్రీనివాసులు, వీరన్నలు అభినందించారు.